క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్క్ రోడ్డు, నిడమర్రు రోడ్డు, టిప్పర్ల బజార్, మన్యం బజార్, మార్కండేయ కాలనీ, కుబేర రైస్ మిల్లు, రాయల్ కన్వెన్షన్, కొండపనేని టౌన్‌షిప్, రత్నాల చెరువు, లక్ష్మీ నరసింహ కాలనీ, శ్రీశైల నగర్, తెనాలి బ్రిడ్జి ఏరియా ప్రాంతాల్లోనూ, రూరల్ పరిధిలోని బేతపూడి, పెదవడ్లపూడి, చినవడ్లపూడి, కొత్తపాలెం, రేవేంద్రపాడు, చినకాకాని, కాజ, ఆత్మకూరు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

కేఎల్‌యూ విద్యార్థులకు అభినందన



తాడేపల్లిరూరల్ : జాతీయ స్థాయి సమైక్యతా శిబిరానికి హాజరైన వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లను వర్శిటీ యాజమాన్యం శుక్రవారం అభినందించింది. ఈ సందర్భంగా వర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలోని వైఎన్ కళాశాలలో ఏడు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి సమైక్యతా శిబిరానికి శాస్త్రీయ నృత్య విభాగంలో పి.నందిని, సంస్కృతి సంప్రదాయాలు విభాగంలో కె.సాయి చైతన్య హాజరయ్యారని తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన సదస్సు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఎన్‌సీసీ క్యాడెట్లకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈనెలలో జరగనున్న బీ, సీ సర్టిఫికెట్ పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పావని, వర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైప్‌లైన్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో తాగునీటి పైప్ పగిలిపోయింది. శుక్రవారం కుళాయిలకు నీరు విడుదల చేయగానే పైపులైన్ నుంచి నీరు వృథా పోయింది. గతంలో ఎంటీఎంసీ అధికారులు ఈ పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. భారీ వాహనాల రాకపోకల వల్ల మళ్లీ అదే ప్రాంతంలో పైప్‌లైన్ పగిలింది. నీరు వృథాగా పోతోంది.

స్వచ్ఛందంగా ముస్లిం శ్మశాన వాటికకు ర్యాంప్ ఏర్పాటు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ చిర్రావూరులో ముస్లిం శ్మశాన వాటికకు ర్యాంప్ ఏర్పాటు చేసి జంగిల్ క్లియరెన్స్ చేయాలని నాయకులను, అధికారులను కోరినా ఎటువంటి స్పందన లేకపోవడంతో ముస్లింలు స్వచ్ఛందంగా నడుం బిగించారు. రూ.లక్ష నిధులు సమకూర్చుకుని శుక్రవారం కరకట్ట పైభాగం నుంచి శ్మశాన వాటిక వరకు ర్యాంప్ వేయించారు. శ్మశానంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. నిధులు ఇచ్చి సహకరించిన పెద్దలు సయ్యదర్ అబ్దుల్ సత్తార్, పఠాన్ బాజీ, సయ్యద్ బాజీ, షేక్ కరీముల్లా, సయ్యద్ నాగులు, మీరావలి, షేక్ ముతలి, షేక్ జిలానీలకు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ఆటో ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన వేములూరిపాడు గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వి.సుబ్బారావు పేరేచర్లలో సెంట్రీ పని చూసుకుని తిరిగి గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. వేములూరిపాడు గ్రామ శివారులో వెనక నుంచి వచ్చిన ఆటో ప్రమాదవశాత్తు ఢీకొంది. ఘటనలో సుబ్బారావుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు.

మహాప్రభూ భారమేల..!

- భారీగా పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీలు
- స్థిరాస్తి, నిర్మాణ రంగాలపై తీవ్ర ప్రభావం
- ఆందోళన చెందుతున్న ప్రజలు



మంగళగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మంగళగిరి టౌన్: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలపై వరుసగా చార్జీల భారం మోపుతోంది. దోపిడీ సర్కారుగా కీర్తి గడిస్తోంది. తాజాగా భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెంచేసింది. గతంలో ఉన్న రిజిస్ట్రేషన్ చార్జీలపై ఒక్కసారిగా 25 శాతం నుంచి 50 శాతం వరకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా ఫిబ్రవరి 1 నుంచి అమలుకు శ్రీకారం చుట్టింది. దీని ప్రభావం భూముల క్రయ విక్రయాలతో పాటు స్థిరాస్తి రంగంతోపాటు భవన నిర్మాణం రంగంపైనా తీవ్రంగా పండింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆదాయం అంతంత మాత్రమే..

2023–24 సంవత్సరానికి సంబంధించి మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.161 కోట్లు ఆదాయం సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. కాగా 142 కోట్ల రూపాయలు మాత్రమే లక్ష్యాన్ని పూర్తిచేశారు. అదే ఆర్థిక సంవత్సరంలో 15,903 డాక్యుమెంటేషన్లు జరిగాయి. కాగా 2024–25 సంవత్సరానికి సంబంధించి మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.200 కోట్లు ఆదాయం సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఫిబ్రవరి 14వ తేదీనాటికి రూ.147 కోట్ల లక్ష్యాన్ని మాత్రమే చేరుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నేటికి 14,221 డాక్యుమెంటేషన్లు జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. రిజిస్ట్రేషన్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఆదాయం పూర్తిగా పడిపోయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 74 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని, ఇంకొక్క నెల మాత్రమే మిగిలి ఉండడంతో లక్ష్యం పూర్తి చేయలేమని అధికారులు చెబుతున్నారు.

డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్

రాష్ట్ర వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రవేశపెడుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ నిమిత్తం ముందస్తుగా అపాయింట్‌మెంట్ తీసుకునేలా ఈ సిస్టమ్‌ను తీసుకువచ్చారు. ఆన్‌లైన్ డేటా ఎంట్రీ సిస్టమ్ ద్వారా ప్రజల వివరాలు నమోదుకు అవకాశం కల్పించారు. దీని ద్వారా డిజిటల్‌గా రిజిస్ట్రేషన్ కోసం టోకెన్ తీసుకునే అవకాశం ఉంది. తద్వారా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్, వివాహ రిజిస్ట్రేషన్లు ఎంపిక చేసుకునేందుకు వీలు కల్పించారు.

ఈ వ్యవస్థ ద్వారా టోకెన్ తీసుకోగానే సబ్‌రిజిస్ట్రార్‌కు ప్రత్యేక క్యూఆర్ కోడ్ జనరేట్ అవుతుంది. శ్లాట్ బుకింగ్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ సిస్టమ్ ద్వారా నమోదు చేసుకున్న శ్లాట్ రద్దు చేసుకుంటే 100 రూపాయలు, సమయం మార్పు చేస్తే 200 రూపాయలు చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. శ్లాట్ బుకింగ్ చేసుకున్న ముందు రోజే ఆన్‌లైన్ ద్వారా డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా ముందే చెల్లించాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు



ఫిరంగిపురంలో శిక్షణకు హాజరైన అంగన్‌వాడీలు



దుగ్గిరాలలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భవానీ

ఫిరంగిపురం: నుదురుపాడు, అల్లంవారిపాలెం జెడ్పీపాఠశాలల్లో పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండోరోజు అంగన్‌వాడీ కర్యకర్తలు శిక్షణ నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలలకు బోధించే తీరును వివరించారు. వైద్యాధికారి యానీగ్రేస్ ఆరోగ్య జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో పి.ప్రసూన, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సునీత, మహాలక్ష్మి పాల్గొన్నారు.

దుగ్గిరాల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోషణ్ బీ పడాయీ బీ శిక్షణ తరగతులు శుక్రవారం కొనసాగాయి. దుగ్గిరాలలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవానీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మానవీయ విలువలు పెంచాలి

మంగళగిరి: ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న రవీంద్ర భారతి స్కూలు వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజిలెన్స్ అధికారి రామప్రసన్న మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు మానవీయ విలువలు నేర్పాలన్నారు. అనంతరం విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేమూరి డానియల్, చైర్మన్ వీరమాచినేని మురళీకృష్ణ,డైరెక్టర్ శాంతి హెచ్‌వోడి శివరావు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

ప్రతి రైతు గుర్తింపు ఐడీ పొందాలి

మేడికొండూరు : సొంత పొలం ఉన్న ప్రతి రైతు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చే 11 అంకెలు గల యూనిక్ ఐడీని పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు తెలిపారు. మేడికొండూరు రైతు కేంద్రం వద్ద రైతుల నమోదు కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈవో నాగరాజు మాట్లాడుతూ పథకాలు అందాలంటే అందరూ నమోదు చేయించుకోవాలని సూచించారు.



రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ మండల అధికారి నాగరాజు

ఎమ్మెల్సీగా లక్ష్మణరావును గెలిపించండి

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



ప్రచారం చేస్తున్న బాలసుబ్రహ్మణ్యం

లక్ష్మీపురం: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు తిరిగి గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. లక్ష్మణరావు గెలుపు కోసం శుక్రవారం గుంటూరు నగరంలోని అన్ని ఉన్నత పాఠశాలలో ఆయన శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు అవినీతికి దూరంగా ఉంటూ, ప్రజల పక్షాన నిజాయతీగా పోరాటం చేశారని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా, ప్రజల సమస్యలపై పోరాడేందుకు లక్ష్మణరావు పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. శాసన మండలి రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలు కాపాడటం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిందని వివరించారు. ఆ లక్ష్యం నెరవేర్చాల్సిన బాధ్యత గ్రాడ్యుయేట్లపై ఉందని కోరారు. 2007 నుంచి అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా పనిచేస్తున్న లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు కైలాస్‌నాథ్, ప్రజా సంఘ నాయకులు సాంబశివరావు పాల్గొన్నారు.

'స్ప్రింట్స్ మానియా'లో నగర విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి, వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారని కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్పోర్ట్స్ అండ్ న్యూట్రిషన్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న విజయవాడలోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన స్ప్రింట్స్ మానియా–2025లో విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని వివరించారు. ఐదో తరగతి విద్యార్థిని వై.భవాని 50 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం, 8వ తరగతి విద్యార్థి వై.భార్గవ్ 50 మీటర్ల హర్డిల్స్, 50 మీటర్ల పరుగు పందెం, 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించినట్లు చెప్పారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు షేక్ ఉమర్ అలీ, షేక్ అయాజ్, షేక్ మహమ్మద్, డి.దీపక్ 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావుగారు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్స్ దుర్గా శ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై కోటయ్య తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే రహదారిలో రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని వివరాల కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్ : సీతానగరం బోటుయార్డు వద్ద ఉన్న మరుగుదొడ్లకు కార్పొరేషన్ అధికారులు శుక్రవారం మరమ్మతులు నిర్వహించారు. ఏఈ అనూష మాట్లాడుతూ గత పుష్కరాల సమయంలో 10 బహిరంగ మరుగుదొడ్లు నిర్మించారని, అవి అపరిశుభ్రంగా ఉండి, పాడైపోవడంతో కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.లక్ష 40 వేలు కేటాయించి మరమ్మతులు చేపట్టామని వివరించారు.

కోళ్ల ఫారాల పరిశీలన

ఫిరంగిపురం: బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రబలుతుందన్న వార్తల నేపథ్యంలో కోళ్ల ఫారాలు పరిశీలిస్తున్నట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని కోళ్లఫారాన్ని శుక్రవారం పరిశీలించి నిర్వాహకుడికి సూచనలు అందజేసినట్లు వివరించారు.

రహదారుల నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: చినరావూరుపార్కు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. తెనాలి పట్టణంలో అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

శివబాబా పుట్టిన రోజు వేడుక

మంగళగిరి: ఆత్మకూరులోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వ విద్యాలయంలో శుక్రవారం శివ బాబా 89వ పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వరంగల్ సబ్ జోన్ ఇన్‌చార్జి కె.సవిత, విజయవాడ సబ్ జోన్ ఇన్‌చార్జి బీకే శాంత, 6వ బెటాలియన్ కమాండెంట్ నగేష్ బాబు, అసిస్టెంట్ కమాండెంట్‌లు ఆశీర్వాద్, హనుమంతు, వి.జయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

కళంకిత నేతలపై అనర్హత వేటు వేయాలి

లక్ష్మీపురం: చట్టాలను ఉల్లంఘించే వారు శాసనకర్తలు కాకూడదని, కళంకిత నేతలపై అనర్హత వేటు వేయాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పలు క్రిమినల్ కేసుల్లో నిందితులైన వారిని పార్టీలు ఎన్నికల్లో నిలబెట్టడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అక్రమార్జనతో ఎన్నికలలో గెలిచి మళ్లీ అంతకంత సంపాదించుకోవడం చాలా మందికి పరిపాటైందని తెలిపారు.

కార్మికుల సమస్యపై మంత్రి స్పందించాలి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు

తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురం ఏసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ స్పందించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. శుక్రవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 73వ రోజుకు చేరుకున్నాయని, ఎన్నికల ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, వై.యెహోషువా, డి.నాగేశ్వరరావు, డి. మాణిక్యరావు, రిబ్కా, సామ్రాజ్యం, మరియమ్మ, ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



దుగ్గిరాల మండలంలో ప్రచారం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్/దుగ్గిరాల: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ రజకుల బజార్, పద్మశాలి బజార్, వీరభద్రస్వామి గుడి, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో కె.గడ్డన్న, బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి శ్రీనివాస్ కుమారి, గాదె సుబ్బారెడ్డి, ప్రభాకర్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కార్మిక సంఘ నాయకులు జెట్టి బాలరాజు ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎస్.ప్రవీణ్, ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై మంటలు



విద్యుత్ స్తంభంపై చెలరేగుతున్న మంటలు

మంగళగిరి టౌన్: స్థానిక ఆటోనగర్‌లో ఓ విద్యుత్ స్తంభంపై శుక్రవారం మంటలు చెలరేగాయి. స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కరెంటు స్తంభానికి ఉన్న వివిధ రకాల వైర్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. విద్యుత్ స్తంభం పక్కనే ఓ ప్లాస్టిక్ కంపెనీ ఉందని, పనికిరాని ప్లాస్టిక్ పదార్థాలన్నీ స్తంభం వద్ద వేశారని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. వాటికి ఎవరో నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పైన ఉన్న కేబుళ్లకు అంటుకుని సర్వీస్ వైర్లు కాలిపోయినట్లు వివరించారు. సకాలంలో విద్యుత్‌శాఖ సిబ్బందిని పంపించి ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి స్తంభానికి ఉన్న సర్వీస్ వైర్లు తొలగించామని మంగళగిరి విద్యుత్ శాఖ ఏడీఈ సురేష్‌బాబు పేర్కొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి



సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి

మంగళగిరి టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంత్యుత్సవం శుక్రవారం మంగళగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కంతేటి జీవన్ సాగర్, జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ కుర్రా పున్నారావు, పట్టణ వైస్ ప్రెసిడెంట్ దామర్ల వీర ప్రసాద్, పట్టణ సెక్రటరి చినరత్తయ్య, నాయకులు వింజమూరి గిరిధర్, డానియేల్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవులకు నివాళి



తాడేపల్లిలో అమరజీవుల చిత్రపటాల వద్ద నివాళి

తాడేపల్లిరూరల్ : ప్రజల కోసం తమ జీవితాలను త్యాగం చేసిన అమరజీవులు కామ్రేడ్ కేవీ పూర్ణచంద్రరావు, కాజా సాంబశివరావు ధన్యజీవులని సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. కుంచనపల్లిలో కేవీ పూర్ణచంద్రరావు, కాజా సాంబశివరావు వర్ధంతిని నల్లపు కిషోర్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను కొనియాడారు.

20న జేకేసీ కళాశాలలో సాఫ్ట్‌స్కిల్స్ పోటీలు



పోటీల పోస్టర్లు విడుదల చేస్తున్న గోపీచంద్, ఎస్సార్కే ప్రసాద్, నాగసుశీల, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20న డమ్ షరేడ్స్ పేరుతో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌స్కిల్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి. గోపీచంద్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ, వ్యక్తిత్వ వికాసం, టీం వర్క్‌ను పెంపొందించడంలో భాగంగా డమ్ షరేడ్స్ పేరుతో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనేందుకు డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రతి టీం నుంచి ఇద్దరేసి ఉండాలని, ప్రతి కళాశాల నుంచి మూడు టీంలు వరకు పాల్గొనవచ్చునని చెప్పారు. విద్యార్థులు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువపత్రంతో పాటు ఐడీ కార్డులను విధిగా ధరించి హాజరు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, ఆంగ్ల శాఖాధిపతి పంచుమర్తి నాగసుశీల, సభ్యులు డాక్టర్ వి. ప్రసాదరావు, జె. మాధవీలత పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి లీలలు మధురం

నగరంపాలెం: సాహితీవేత్త పి.ఎస్.ఆర్.ఆంజనేయ ప్రసాద్ జయంతిలో భాగంగా బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శ్రీకృష్ణ జననంపై ఆధ్యాత్మిక ప్రవచనం శుక్రవారం కొనసాగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచనం చేశారు. శ్రీకృష్ణుడి జన్మ వృత్తాంతం, బాలుడిగా ఆయన లీలలు మధురాతి మధురమని తెలిపారు. ఆయన బాల క్రీడలన్నీ దివ్య వైభవాలని పేర్కొన్నారు. పుట్టుకే లేని పరమాత్మ పుట్టినట్లు కనిపించడం ఒక లీల పేర్కొన్నారు. మానవ జాతిని ధర్మమార్గంలో నడిపించేందుకు ఆయన అవతరించాడని తెలిపారు. తనలోనే సమస్త విశ్వం దాగిందని, తల్లికి తన నోటిలో విశ్వరూపాన్ని చూపించిన సన్నివేశం ఇందుకు తార్కాణమని చెప్పారు. కార్యక్రమంలో పి.రవికిశోర్, పి.హైమానంద పాల్గొన్నారు.